

తెలంగాణభవన్‌లో బుధవారం జరిగిన ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు. చిత్రంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పార్టీ నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, బోయినపల్లి వినోద్‌కుమార్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ పుస్తకం

'కాంగ్రెస్ 420 హామీలు' పుస్తకాన్ని విడుదల చేస్తున్న కేటీఆర్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు మోసపూరితమైనవని విమర్శిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఒక పుస్తకాన్ని విడుదల చేసింది. కాంగ్రెస్ హామీల్లోని డొల్లతనాన్ని వివరిస్తూ.. ప్రతీ హామీకి ఒక నంబర్ ఇస్తూ ప్రత్యేకంగా పుస్తకాన్ని రూపొందించారు. వరుస క్రమంలో హామీలను రాయగా.. అవి మొత్తం 420 అయ్యాయి. దీనికి సంబంధించిన పుస్తకాన్ని బుధవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ విడుదల చేశారు. వందలకొద్ది హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడేమో ఆరు హామీలు అని మాత్రమే చెప్తున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ వివిధ డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన హామీలను కూడా ఒక్కచోట చేర్చి పుస్తకాన్ని రూపొందించామని చెప్పారు. కాంగ్రెస్ హామీల సంఖ్య మోసానికి మారుపేరుగా ఉండే 420గా ఉన్నదని, వాళ్ల హామీలు కూడా 420 హామీలలాగే ఉన్నాయని ఎద్దేవా చేశారు.

తెలంగాణకు బీఆరెస్సే.. బలం, దళం, గళం

మొదటిపేజీ తరువాయి...

గెలిపించాలని ప్రజలకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశం కేటీఆర్ అధ్యక్షతన జరిగింది. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రయోజనాల కోసం, కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడేందుకు బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించాలని కోరారు. పదేండ్లలో పార్లమెంటులో తెలంగాణ మాట వినిపించిందంటే దానికి కారణం బీఆరెస్సేనని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఏనాడూ తెలంగాణ పదం మాట్లాడలేదని మండిపడ్డారు.

తెలంగాణ పేరు చెబితే..

దేశంలో అనేక రాష్ట్రాల పేర్లు చెబితే కొందరు నాయకులు గుర్తుకొస్తారని, వారిలో బెంగాల్‌కు మమత బెనర్జీ, తమిళనాడుకు స్టాలిన్, డీఎంకే, అన్నాడీఎంకే, ఏపీకి జగన్, చంద్రబాబు, బీహార్‌కు నితీశ్‌కుమార్, తేజస్వీ యాదవ్, ఒడిశాకు నవీన్ పట్నాయక్ మాదిరిగా తెలంగాణ అంటే గుర్తుకొచ్చే నాయకుడు కేసీఆర్ మాత్రమేనని పేర్కొన్నారు. కేసీఆర్ వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఒక అస్తిత్వం, గౌరవం వచ్చాయని అన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం అంటే ఎన్టీఆర్ గుర్తుకొచ్చినట్టు, తెలంగాణ అంటే కేసీఆర్ గుర్తుకొస్తారని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల గురించి ఢిల్లీలో బలంగా వినిపించాలంటే బీఆర్ఎస్ దండు పార్లమెంటులో ఉండాల్సిందేనని అన్నారు. తెలంగాణ 'కోసం కాంగ్రెస్ నేత రాహుల్, బీజేపీ జాతీయ నేతలు పార్లమెంటులో ఏనాడైనా మాట్లాడారా? పార్లమెంటులో తెలంగాణ దళం లేకుంటే ఢిల్లీలో తెలంగాణ ఉనికి ఉంటుందా?' అని ప్రశ్నించారు. గతంలో అసెంబ్లీలో తెలంగాణ పదాన్ని నిషేధించినట్టే బీఆర్ఎస్ ఎంపీలు లేకుంటే పార్లమెంటులో తెలంగాణ నిషేధించబడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. 'తమిళనాడు మాదిరి రాజకీయ వైరుధ్యాలకు అతీతంగా ఇక్కడి కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణ కోసం ఏనాడూ కలిసి రాలేదు. తెలంగాణకు నష్టం జరిగినా పట్టించుకోలేదు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మత విద్వేషం తప్ప రాష్ట్రానికి బీజేపీ చేసిన పనిలేదని దుయ్యబట్టారు. మోదీకి వ్యతిరేకంగా పోరాడే దమ్మున్న నేత కేసీఆర్ అని, యూనిఫాం సివిల్ కోడ్‌ను తీవ్రంగా వ్యతిరేకించింది బీఆర్ఎస్ అని గుర్తు చేశారు.

కాంగ్రెస్, బీజేపీ మధ్య అవగాహన

గత లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే కాంగ్రెస్, బీజేపీ మరోసారి అంతర్గతంగా అవగాహనకు వచ్చారని, అందుకే బీజేపీ ఎంపీ బండి సంజయ్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని పొగుడుతున్నారని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు. తెలంగాణలో రెండు జాతీయ పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం పనిచేయడం ప్రారంభించాయని ఆరోపించారు. తెలంగాణ ఆస్తిత్వం కోసం లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బలపరచాలని ప్రజలను కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన చిన్న చిన్న పొరపాట్లను సరిదిద్దుకొని ఆత్మ పరిశీలన చేసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా, ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిందని చెప్పారు. ఇప్పుడు హామీలు ఎత్తగొట్టేందుకు శ్వేతపత్రాల పేరుతో ప్రజల దృష్టి మళ్లించే దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నేతలిచ్చిన 420 హామీలను పక్కనపెట్టి డ్రామాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ రైతుబంధు డబ్బులు విడుదలచేయకపోవటంతో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, గతంలో డిసెంబర్ నుంచి మార్చి వరకు రైతుబంధు వేశారని సీఎం చెప్పటం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అబద్ధాలతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ, అదే ప్రచారాన్ని మరోసారి తెలంగాణపై ప్రయోగించాలని చూస్తుందని, వాటిని తిప్పికొడదామని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు మరో 70 రోజులే సమయం ఉన్నదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ గోబెల్స్ ప్రచారాన్ని తెప్పికొట్టి ప్రజలను ఓటు అడుగుతామని, లోక్‌సభ మాత్రమే కాకుండా రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా పార్టీని సమాయత్తం చేస్తామని ఆయన తెలిపారు.

తెలంగాణభవన్‌లో బుధవారం జరిగిన ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పార్టీ సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు

విజయాలను వైఫల్యాలుగా చిత్రీకరించే కుట్ర

తెలంగాణ విజయాలను వైఫల్యాలుగా చిత్రీకరించేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టును కూడా విఫల ప్రాజెక్టుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ పుట్టుకను కూడా అవమానించిన నరేంద్రమోదీని, బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో అడ్డుకుంటామని ప్రకటించారు. మత విద్వేషం తప్ప ఒక మంచి పని చేయని బీజేపీతో పోరాడాలంటే కేసీఆర్ లాంటి బలమైన నాయకుడు కావాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అనేక స్థానాల్లో ఓడించింది బీఆర్ఎస్ మాత్రమేనని తెలిపారు. బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, సోయం బాపురావును ఓడగొట్టింది బీఆర్ఎస్ అనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ దెబ్బకు అంబర్‌పేటలో కిషన్‌రెడ్డి పోటీ చేయకుండా తప్పించుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ముస్లింలు గందరగోళపడకుండా బీజేపీని ఎదుర్కొనేది బీఆర్ఎస్ అనే విషయాన్ని గుర్తించి అదిరించాలని కోరారు.

త్వరలో అసెంబ్లీ స్థాయి సమావేశాలు

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటామని కేటీఆర్ తెలిపారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమావేశాల అనంతరం అసెంబ్లీ నియోజకవర్గ సమావేశాలు ఉంటాయని చెప్పారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక ఏకపక్షంగా ఉండదని, అందరి అభిప్రాయాలు తీసుకొని చేస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తర్వాత బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల నుంచి అనేక అభిప్రాయాలు వచ్చాయని తెలిపారు. కేసీఆర్ సీఎం పదవి నుంచి దిగిపోతారని, ఓడిపోతారని కలలో కూడా అనుకోలేదని గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారని చెప్పారు. ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సమీక్షలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల సూచనలను తీసుకున్నామని, వీటిని పార్టీ అభిప్రాయంగా కాకుండా ప్రజల అభిప్రాయంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ప్రభుత్వంపై, పార్టీపై జరిగిన దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టలేకపోయామని కార్యకర్తలు తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని సూచించారని తెలిపారు. కాంగ్రెస్ దాడులను ప్రజాస్వామికంగా ఎదుర్కొంటామని తెలిపారు.

పోరాటాలు కొత్తకాదు: హరీశ్‌రావు

బీఆర్ఎస్‌కు ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదని, ప్రతిపక్షం అంటే ఎలా ఉంటుందో చూపిస్తామని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. అవసరమైతే జైలుకు వెళ్లడానికి సిద్ధమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన రూ.2 లక్షల రైతు రుణమాఫీ హామీని అమలు చేసి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. ఓటమితో కార్యకర్తలు నిరాశకు లోనుకావద్దని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసినా, బిల్లుల విడుదలో జాప్యం చేసినా హైకోర్టుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ప్రకటించారు. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేస్తే ఆ పనుల దగ్గర ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసుకొనే అంశంపై ముందుముందు చర్చిస్తామని తెలిపారు. అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకోవాలని పార్టీ క్యాడర్‌కు సూచించారు. మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ ద్రోహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, ఎమ్మెల్సీ విఠల్, మాజీ ఎమ్మెల్యేలు కొనేరు కోనప్ప, విఠల్‌రెడ్డి, అత్రం సక్కు తదితరులు పాల్గొన్నారు.

నేడు కరీంనగర్ బీఆర్ఎస్ సమావేశం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా బుధవారం కరీంనగర్ లోక్‌సభ సమావేశం నిర్వహించనున్నారు. లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు దీనికి హాజరుకానున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి సగటున 70 మందిని ఆహ్వానించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సమాయత్తం చేసి, వారి సలహాలు, సూచనలు స్వీకరించడంపై సమావేశంలో చర్చించనున్నారు. మొదటి రోజు ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని నేతలతో సమావేశం నిర్వహించారు. ఇందులో లిఖిత పూర్వక సూచనలు, సలహాలు స్వీకరించారు. దాదాపుగా 26 మందికి పైగా మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలిపారు. సన్నాహక సమావేశంతో పార్టీ కేడర్‌తో నూతనోత్సాహం నెలకొంది. ఈ సమావేశాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

బీఆర్ఎస్ నేత దాసోజుకు బెదిరింపు కాల్స్

ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు

బంజారాహిల్స్, జనవరి 3: బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌కుమార్‌కు బెదిరింపు కాల్స్ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. షేక్‌పేట సమీపంలోని ఆదిత్య ఎంప్రెస్ పార్క్‌లో నివాసముంటున్న దాసోజు మొబైల్ ఫోన్‌కు గత నెల 6న రెండు గుర్తుతెలియని నెంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయి. దుర్భాషలాడటంతోపాటు అంతు చూస్తామంటూ వచ్చిన బెదిరింపు కాల్స్ చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల దాసోజు శ్రవణ్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కోర్టు అనుమతి తీసుకున్న పోలీసులు బుధవారం ఐపీసీ 506 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటోడ్రైవర్ల భిక్షాటన

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన
- బస్సుల్లో ఉచిత ప్రయాణంతో రోడ్డున పడ్డామని ఆవేదన

హైదరాబాద్/ సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ)/హన్మకొండ చౌరస్తా/కారేపల్లి/నార్కట్‌పల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు బుధవారం భిక్షాటన చేపట్టారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. 'మా బతుకులు రోడ్డున పడ్డాయి.. అక్కా సాయం చేయి.. అమ్మా సాయం చేయి' అంటూ భిక్షమెత్తుతూ నిరసన తెలిపారు. తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ (టీఏటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా భిక్షాటన చేశారు. రోజుకు కనీసం రూ.200 కూడా రావడం లేదని, పిల్లలు ఫీజులు, ఇంటి కిరాయి, వాహన ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తంచేశారు. తమను వెంటనే ఆదుకోవాలని, ప్రతి నెలా రూ.15 వేల జీవన భృతి అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 7న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్టు చెప్పారు. టీఏటీయూ ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి విభిన్న నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం హైదరాబాద్, నల్లగొండ, కరీంనగర్, వరంగల్, మెదక్, ఖమ్మం జిల్లాల్లో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. కూడళ్ల వద్ద భిక్షాటన చేశారు. కరీంనగర్ బస్టాండు ఎదుట, తెలంగాణ చౌక్‌లో బాటసారులు, ప్రయాణికుల వద్ద భిక్షాటన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరిపించి తమ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ చౌక్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి దండాలు పెట్టి వేడుకున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రానికి చెందిన ఆటోవాలాలు ఖమ్మం- ఇల్లందు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఫ్రీ బస్ పథకంపై రాష్ట్రప్రభుత్వం పునరాలోచన చేయాలని వేడుకుంటున్నారు. ఆటోడ్రైవర్లు హనుమకొండ వేయిస్తంభాల దేవాలయ సమీపంలో భిక్షాటనతో నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లాలో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నార్కట్‌పల్లిలోని ఆర్టీసీ డిపో ఎదుట రాస్తారోకో చేశారు. నల్లగొండ, మిర్యాలగూడ బస్టాండ్‌లో, ఆలేరులో భిక్షాటన చేసి నిరసన తెలిపారు.

కేటీఆర్, కేకేకు నివేదిక అందిస్తున్న ఆటో డ్రైవర్ల అధ్యయన కమిటీ సభ్యులు

కేటీఆర్, కేకేకు ఆటో డ్రైవర్ల వినతి

రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావుకు ఆటో డ్రైవర్ల అధ్యయన కమిటీ నివేదిక అందించింది. బుధవారం తెలంగాణభవన్‌లో ఆ కమిటీ నేతలు ఎల్ రూప్ సింగ్, జీ రాంబాబుయాదవ్, వేముల మారయ్య, పీ నారాయణ నివేదిక అందించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఏడు లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని, రాష్ట్రంలోని 33 జిల్లాలు తిరిగి అధ్యయనం చేసి ఈ నివేదిక సమర్పించామని కమిటీ నేత ఎల్ రూప్‌సింగ్ తెలిపారు.

బుధవారం హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం సమీపంలో నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

'ఎమ్మెల్సీ'పై హైకోర్టుకు దాసోజు, కుర్రా

- గవర్నర్ చర్య రాజ్యాంగ విరుద్ధం
- హైకోర్టులో పిటిషన్ దాఖలు
- రేపు సీజే నేతృత్వంలో విచారణ

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): శాసనమండలి సభ్యులుగా నియమించాలని మంత్రి మండలి చేసిన సిఫార్సులను గవర్నర్ తిరస్కరించడానికి వీల్లేదని దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు ఈ నెల 5న విచారణ చేయనున్నది. ఎమ్మెల్సీలుగా డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణను నామినేట్ చేయాలని కోరుతూ కేసీఆర్ సర్కారు గత జూలైలో చేసిన ప్రతిపాదనలను గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. ఈ చర్యను సవాల్ చేస్తూ వీరిద్దరు పిటిషన్ దాఖలు చేశారు. గవర్నర్ తన పరిధి దాటి వ్యవహరించారని, రాజ్యాంగం ప్రకారం మంత్రివర్గం చేసిన సిఫార్సులను గవర్నర్ ఆమోదించి తీరాలని తెలిపారు. ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ తిరస్కరించటం ఏకపక్షమని, చట్టవిరుద్ధమని ప్రకటించాలని పిటిషన్‌లో కోరారు. ఆర్టికల్ 171 (5) ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం లేదని పేర్కొన్నారు. అయితే, గవర్నర్ నిర్ణయంపై న్యాయ సమీక్ష చేయటం వీలుకాదంటూ పిటిషన్‌పై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ రెండు అంశాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరధే నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టనున్నది.

వీసీ పోస్టుపై నిర్ణయం తీసుకోండి

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): తనను కొనసాగించడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరినట్టు సమాచారం. వీసీ పోస్టుపై హైకోర్టులో కేసు నడుస్తున్నది. ఈ నేపథ్యంలో తన కొనసాగింపుపై స్పష్టత కోరినట్టు సమాచారం. న్యాయ వివాదాల వల్ల ఇటీవల డీఎంఈ రమేశ్‌రెడ్డిని మార్చిన ప్రభుత్వం త్రివేణికి బాధ్యతలు అప్పగించింది. ఇదే తరహాలో వీసీని మారుస్తారని ప్రచారం జరుగుతున్నది.

గ్రేటర్‌లో కొనసాగుతున్న చలి తీవ్రత

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయం నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోవడంతో గ్రేటర్ హైదరాబాద్‌లో చలి తీవ్రత కొనసాగుతున్నది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8గంటల వరకు దట్టమైన పొగమంచు ఏర్పడనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

జీఎస్‌డీపీలో తెలంగాణ టాప్

- 3,08,732 కోట్లతో అగ్రస్థానం
- 2022-23లో 11.97% వృద్ధిరేటు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో తెలంగాణ మరోసారి సత్తా చాటింది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో 11.97% వృద్ధిరేటును నమోదు చేయడం ద్వారా రూ.3,08,732 కోట్ల జీఎస్‌డీపీతో అన్ని రాష్ట్రాల కంటే అగ్రస్థానంలో నిలిచింది. ఉద్యమ నేత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణల వల్ల గత తొమ్మిదిన్నర ఏండ్లలో రాష్ట్రం వ్యవసాయ, మౌలిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించడం వల్లనే ఇది సాధ్యమైంది. ఈ జాబితాలో తెలంగాణ తర్వాత కర్ణాటక, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలు ఉన్నాయి. ఏపీ కూడా టాప్-10లోనే ఉండటం విశేషం.

టాప్-10 రాష్ట్రాల జీఎస్‌డీపీ వివరాలు

రాష్ట్రం	రూ.కోట్లలో
తెలంగాణ	3,08,732
కర్ణాటక	3,01,673
హర్యానా	2,96,685
తమిళనాడు	2,73,288
మహారాష్ట్ర	2,42,247
ఉత్తరాఖండ్	2,33,565
ఆంధ్రప్రదేశ్	2,19,518
పంజాబ్	1,73,873
రాజస్థాన్	1,56,149
మధ్యప్రదేశ్	1,40,583

భగ్గుమన్న 'ఇథనాల్'

మొదటిపేజీ తరువాయి...

లోపలికి చొచ్చుకెళ్లి గోడలు, సామగ్రి, షెడ్లను కూల్చివేశారు. టిప్పర్ల అద్దాలను ధ్వంసం చేశారు. అక్కడున్న స్కార్పియో వాహనాన్ని బోల్తా పడేశారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఫ్యాక్టరీ లోపలికి మహిళలు వస్తుండగా, పోలీసులు అడ్డుకొని బాష్పవాయువు ప్రయోగించేందుకు సిద్ధమయ్యారు. తమ ప్రాణాలకంటే పరిశ్రమ ఏర్పాటుకే సహకరిస్తున్నారని పోలీసులతో రైతులు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న నిర్మల్ అడిషనల్ ఎస్పీ క్రాంతిలాల్ పాటిల్.. అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సముదాయించేందుకు ప్రయత్నించగా కలెక్టర్ రావాలని అన్నదాతలు పట్టుబట్టారు. నిర్మల్ రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ కూడా వచ్చి రైతులతో మాట్లాడారు. పరిశ్రమను నిలిపివేస్తామంటేనే ఆందోళన విరమిస్తామని తేల్చిచెప్పటంతో కొంతమంది రైతులను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించుకొని 20 మందితో కమిటీ వేస్తామని తెలిపారు. కమిటీ వద్దని పరిశ్రమను రద్దు చేస్తామని హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని, రైతులు మళ్లీ రోడ్డుపై బైఠాయించారు. కాగా, బోల్తాపడిన స్కార్పియో వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో పోలీసులు రైతులపై లాఠీచార్జి చేసి, అక్కడి నుంచి పంపించేశారు.

ఇథనాల్ పరిశ్రమకు చెందిన స్కార్పియో వాహనానికి నిప్పంటించిన ప్రజలు

నేడు బంద్‌కు పిలుపు

ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గురువారం దిలావర్‌పూర్, గుండంపల్లితోపాటు వివిధ గ్రామాలు బంద్ పాటించాలని రైతులు, గ్రామస్థులు పిలుపునిచ్చారు. హైవేపై వంటావార్పు, బైక్ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. తాము నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల తమ పచ్చని పంట పొలాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను నిలిపివేసి, ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు.

ఇథనాల్ పరిశ్రమ వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు